క్లుప్తంగా

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళ వారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

1న సహస్ర తులసిపూజ

కనక మహాలక్ష్మి దేవస్థానంలో జూన్ 1న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుము రూ.1500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆరిలోవ: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఆరిలోవ ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుర్గాబజార్ దరి శివశంకర్‌నగర్‌కు చెందిన కె.అవినాష్(19) ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. ఏ పనీ చేయకుండా ఖాళీగా ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అవినాష్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. కుమారుడి మృతితో అవినాష్ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. తండ్రి ప్రకాష్ మార్బుల్ పలకలు అమర్చే పని చేస్తుంటాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అవినాష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, దానిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

150 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు వెలంపేట దరి సైలాడ పైడితల్లి కల్యాణమండపం వద్ద మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. వైద్యాధికారి సుభద్ర మాట్లాడుతూ తొలి దశల్లో క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారణ సాధ్యమేనన్నారు. అనంతరం స్క్రీనింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల దినోత్సవం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ: అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను మంగళవారం ఉదయం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. జూన్ 1వ తేదీన ఈ కళాశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు నరవ ప్రకాశరావు, జగదీశ్వరరావు, సత్యశాంతి, లత, రామారావు, బాబ్జీ పాల్గొన్నారు.

నాలుగేళ్ల పాలనతో నవశకానికి నాంది

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ప్రజాభిమానం చూరగొన్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. ప్రజారంజక పాలనకు నాలుగేళ్లు పూర్తయినందున మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వికలాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. నిరుపేద మహిళలకు చీరలు అందజేశారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే తినిపించారు. దక్షిణ నియోజకవర్గ పరిధి అంబికాబాగ్ రామాలయ కల్యాణమండపం వేదికగా నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, రెల్లి కుల కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూధనరావు, పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, కనక మహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పార్టీ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులతో కలిసి వికలాంగులకు వీల్‌చైర్లు, పేద మహిళలకు చీరలు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 98.3 శాతం హామీలు అమలు చేశారన్నారు.

రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం గౌరవంగా తలెత్తుకుని జీవించేలా అందరికీ ఇళ్లు పథకం ద్వారా 31 లక్షల మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఒక్క అమరావతిలోనే 51 వేల మంది నిరుపేద అక్కా చెల్లెమ్మల పేరిట ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు ముందుకు తీసుకెళ్తూ భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశంలో ఏ ఒక్క సీఎం చేయని విధంగా గొప్ప ప్రజారంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులందరినీ అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఎంతో మంది బడుగు, బలహీన వర్గాల ప్రజలు లబ్ధి పొందారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, పలు వార్డుల అధ్యక్షులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



నిరుపేద మహిళకు చీర అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

హార్బర్‌లో కేక్ కటింగ్

మహారాణిపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఫిషింగ్ హార్బర్‌లో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు మంగళవారం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో 38వ వార్డు అధ్యక్షుడు సన్యాసిరావు, మత్స్యకార సంఘాల నాయకులు సింహాద్రి అప్పన్న, పెద్ద అప్పారావు, కోలా స్వామి, వాసుపల్లి ఎల్లారావు, ఎ.దానయ్య, పార్టీ సీనియర్ నాయకులు ఆనంద్, యేసు, డి.తాతారావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

జనరంజక పాలనకు నాలుగేళ్లు

జగదాంబ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనకు నాలుగేళ్ల పండగని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. వార్డు పరిధి గాజులవీధిలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం ఆయన కేక్ కట్ చేశారు. విల్లూరి మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధిని జగనన్న చేశారన్నారు. అన్ని కులాలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసిన ఘనత ఆయనకే చెందుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయం

మహారాణిపేట: జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన రాష్ట్ర చరిత్రలో ఓ సువర్ణాధ్యాయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ అన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా 29వ వార్డులోని అమెరికన్ ఓల్డేజ్ హోమ్‌లో కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ వృద్ధులకు భోజనాలు వడ్డించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డులో మంగళవారం సంబరాలు జరిపారు. వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జానకీరామ్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రెయ్యి డేవిడ్ రాజు, ఆకుల ఏసు, సత్యవతి, ఆదిలక్ష్మి, కాసారపు వాసు, సారిక దైవకుమార్, ఆనంద్, శేఖర్, రమణ, రోజా, రమణి తదితరులు పాల్గొన్నారు.



గాజుల వీధిలో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తదితరులు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సీతంరాజు సుధాకర్



నాయకులు, కార్యకర్తలకు కేక్ తినిపిస్తున్న కార్పొరేటర్ జానకీరామ్



హార్బర్‌లో కేక్ కట్ చేస్తున్న కోలా గురువులు

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపు



దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు, ఈవో రమాబాయి

అల్లిపురం: అస్సాంగార్డెన్స్‌లోని నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం హుండీల లెక్కింపును మంగళవారం నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పీఎల్ఎన్ రాజు, ఈవో రమాబాయి ఆధ్వర్యంలో హుండీలు తెరిచి, శ్రీవారి సేవాసంఘం సభ్యుల సహకారంతో లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు జోగారావు శర్మ , ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో..

అస్సాంగార్డెన్స్, శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పీఎల్ఎన్ రాజు, ఈవో రమాబాయి, ఆలయ అర్చకుడు భార్గవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



జోనల్ కార్యాలయం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

జగదాంబ: ఎండలు బెంబేలెత్తిస్తున్న నేపథ్యంలో జీవీఎంసీ జోన్–4 సెక్యూరిటీ గార్డులు మజ్జిగ పంపిణీ చేశారు. మంగళవారం జోనల్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ కార్యాలయంలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులందరూ డబ్బులు కూడగట్టి, మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు తెలియజేశారు. గోవింద్, శ్రీను , రమేష్, ప్రసాద్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

అల్లిపురం: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అల్లిపురం మెయిన్‌రోడ్డు, గాంధీ బొమ్మ వద్ద పాదచారులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. వాసవీ క్లబ్ అల్లిపురం అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు, కార్యదర్శి బీవీఎల్ కుమార్, పీవీఎస్ఆర్ గుప్తా పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కొత్తమ్మ జాతర మహోత్సవం

- అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

అల్లిపురం: అల్లిపురం అమ్మవారి వీధిలో కొలువుదీరిన కొత్తమ్మ వారి జాతర మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఘటాలతో పసుపు, వేప కొమ్మలతో నింపిన నీటిని తీసుకువచ్చి, స్వయంగా అభిషేకాలు చేశారు. భక్తులు మొక్కుబడులు, కానుకలు చెల్లించారు.

వేడుకగా తిరువీధి : సాయంత్రం అమ్మవారి తిరువీధి ఉత్సవాన్ని అల్లిపురం మెయిన్‌రోడ్డు, సౌత్‌జైలు రోడ్డు, నీలమ్మవేపచెట్టు రోడ్డు, వివేకానంద కాలనీ, కుమ్మరవీధి, బంగారుమెట్ట, అమ్మవారి వీధి అమ్మవారి ప్రధాన దేవాలయం వరకు కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మవార్ల కళారూపాలతో కళాకారులు అలరించారు. కాంతారా నృత్యం, పులివేషాలు, తప్పెటగుళ్లు, సంప్రదాయ డప్పు వాయిద్యాలు, కాంగో, తీన్‌మార్ తదితర కార్యక్రమాలు హోరెత్తించాయి. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మజ్జిగ, పులిహోర ప్రసాదాలు పంపిణీ చేశాయి



ప్రత్యేక అలంకరణలో కొత్తమ్మవారు



విశేషంగా అలంకరించిన అమ్మవారి ప్రధాన దేవాలయం

అమ్మవారిని దర్శించుకున్న కోలా గురువులు

అమ్మవారిని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు దర్శించుకుని పూజలు చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు నీలాపు విజయానందరెడ్డి, కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ తదితరులు దర్శించుకున్నారు.

కార్మికుల ఐక్యతే సీఐటీయూ లక్ష్యం

అల్లిపురం: కార్మికులను ఐక్య పరచడమే సీఐటీయూ ప్రధాన లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో యూనియన్ ఉపాధ్యక్షుడు కె.ఎం.కుమార్ మంగళం అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ 1970 నుంచి ఈనాటి వరకు కార్మికుల కోసం సిటు పోరాడుతూనే ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 830 రోజులుగా చేస్తున్న పోరాటమే ఇందుకు సాక్ష్యమన్నారు.

విశాఖ నగరంలో సుమారు 3 లక్షల మంది కార్మికులు ఉండగా సీఐటీయూలో కేవలం 40 వేల మంది మాత్రమే సభ్యులుగా ఉన్నారన్నారు. కనీసం లక్ష మంది సభ్యులుంటే మనం శాసించే స్థాయికి చేరుతామన్నారు. కార్మికులందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, మణి, ఆర్.కె.ఎస్.వి.కుమార్ పాల్గొన్నారు.

దాబాగార్డెన్స్: సిటూ 54వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన గల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సిటూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, పలువురు నాయకులు పాల్గొని పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలు, త్యాగాలు చేసి సాధించిన 44 చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా మార్చిందని, దీంతో సమ్మె చేసే హక్కు, బేరసారాలు ఆడే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు కూడా హరించారన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వరంగ పరిశ్రమలను దోచిపెట్టడానికి బీజేపీ పూనుకుందని ఆరోపించారు. కోట్లాది మంది కార్మికులు పని భద్రత కోల్పోయారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

కనీస వేతనం రూ.26 వేలకు తక్కువ కాకుండా చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం జగదాంబ సిటూ కార్యాలయం నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేఎం కుమార్ మంగళం, బి.జగన్, ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావు, నూకరాజు, చంద్రమౌళి, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రక్తదానం

దాబాగార్డెన్స్: ఓలా ఉబర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రక్తదానం చేశారు. సిటు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 120 మంది ఓలా ఉబర్ డ్రైవర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాజారత్నం మాట్లాడుతూ రక్తదానం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కారు డ్రైవర్లు ఐక్యంగా మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విశాఖ క్యాబ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ ఓలా ఉబర్ యాప్‌లో లింక్ అయి 2,500 మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే పెట్రోలు, కారు ఇన్సూరెన్స్, అన్ని రకాల మెయింటెనెన్స్‌లు డ్రైవరే పెట్టుకుంటున్నప్పటికీ, వచ్చిన ఆదాయంలో 30 శాతం వరకు కమిషన్ నిర్వాహకులు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు పోలినాయుడు, శరత్, ఎస్.అబ్బాయి, కృష్ణ, నాయుడు, మురళి, గోపి, ఆనంద్, లక్ష్మీనారాయణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఓలా ఉబర్ డ్రైవర్లు

మొరాయించిన సర్వర్లు

జగదాంబ: స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్వర్లు పనిచేయకపోవడంతో రెండు రోజులుగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సెంట్రల్ సర్వర్లు పనిచేయకపోవడమే ఇబ్బందులకు కారణమని తెలుస్తోంది. కనీసం నెలాఖరున అయినా సర్వర్లు పనిచేస్తే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేస్తాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేషస్పందన లభించింది. ప్రజలు హాజరై ఎమ్మెల్యేకు తమ సమస్యలు తెలియజేశారు. దొండపర్తిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త మాట్లాడుతూ డయాబెటిస్ కారణంగా కాలు తీసేయడంతో చాలా ఇబ్బందికరంగా ఉందని చెప్పడంతో వెంటనే కృత్రిమ కాలు అమర్చేందుకు జైపూర్ సొసైటీ సభ్యులతో మాట్లాడారు. నిరుపేద కార్యకర్తలు తమ పిల్లలను ఇంటర్మీడియెట్ చదివించలేక పోతున్నారని తెలిసి వైజాగ్ డిఫెన్స్ అకాడమీ, రామబాణం కళాశాలల్లో నలుగురిని ఉచితంగా చేర్పించారు. పలు సమస్యలపై వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే వాసుపల్లి వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అంబికాబాగ్ రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం



ప్రత్యేక అలంకరణలో విశ్వేశ్వర స్వామి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6.30 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠాపనతో అంకురార్పణ చేశారు. ధ్వజారోహణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు వెంకటరత్నం, అనురాధ, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు టి. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం..

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం విశేష హోమాల అనంతరం ఉదయం 10.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిపించనున్నారు.

సత్యదేవుని ఆలయంలో..

ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో వార్షిక దివ్య కల్యాణోత్సవాలు మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ నాగ జగదీష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 7 గంటలకు స్వామి దివ్య తిరు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

పోర్టు వెంకన్న ఆలయంలో ..

పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 6.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం జరిపించనున్నారు.

నేడు విశ్వేశ్వరస్వామి కల్యాణం

సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 31 నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. బుధవారం రాత్రి 8.05 గంటలకు ఆలయంలో వేంచేసియున్న పరమశివశర్మన్ ముని మనుమడు మహనటేశ్వరవర్మన్ కుమారుడు విశ్వేశ్వరస్వామికి, మహమేరోర్న శర్మన్ ముని మనమరాలు, మందార చల శర్మన్ మనుమరాలు బాల త్రిపురసుందరికి పరిణయం జరిపించనున్నట్లు ఆహ్వాన పత్రిక ముద్రించారు.

కొత్త రూ.50 వెండి నాణెం

- సొంతం చేసుకున్న అల్లిపురం యువకుడు

అల్లిపురం : దేశంలో పులుల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల భారత ప్రభుత్వం, పులి ముఖంతో అతి తక్కువ ముద్రణతో 50 రూపాయల వెండి నాణాం విడుదల చేసింది. ఆ వెండి నాణాన్ని అల్లిపురం, వాసవి క్లబ్ సభ్యుడు దాసు ఆదినారాయణమూర్తి (అనిల్) సొంతం చేసుకున్నాడు. అనిల్‌కు దేశ విదేశీ నాణాలు, నోట్ల సేకరణపై ఆసక్తితో దీనిని సేకరించినట్లు తెలిపారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.75 నాణాం కూడా రానుందని ఆయన తెలిపారు. నాణాల సేకరణ అభిరుచిగా మార్చుకున్న అనిల్‌ను వాసవి క్లబ్ అల్లిపురం అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు, కార్యదర్శి బీవీఎల్ కుమార్, కోశాధికారి పీవీఎస్ఆర్ గుప్తా తదితరులు అభినందించారు.



రూ.50 వెండి నాణెం, సేకరణకర్త దాసు ఆదినారాయణమూర్తి (అనిల్)